సాక్షి
వికారాబాద్
సోమవారం । 28 । ఆగస్టు । 2023



సంప్రదాయ సాగు..

సాగు ఖర్చులు భారీగా పెరగడం, వీటికి తోడు గిట్టుబాటు ధర రాక సంప్రదాయ పంటలు కనుమరుగవుతున్నాయి. 8లో▸



ఆరోగ్యమే మహాభాగ్యం

ఆరోగ్యాన్ని మించిన సంపద ఏదీ లేదని, దాన్ని కాపాడుకోవడం మన బాధ్యత అని డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. 8లో▸



మొండి వైఖరి వీడాలి

సెకండ్ ఏఎన్‌ఎంల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండివైఖరి వీడాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

రేపు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం

పూడూరు: పెండింగ్ సమస్యలు పరిష్కారం కోసం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు మంగళవారం సమావేశం కానున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా రీజనల్ సెక్రటరీ అబ్దుల్ జబ్బార్ తెలిపారు. ఉదయం 11గంటలకు వికారాబాద్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సమావేశం ఉంటుందని తెలిపారు. జిల్లాలోని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు. సమస్యల పరిష్కారం, సంస్థ నుంచి రావాల్సిన వసతులు తదితర వాటిపై చర్చించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

రేపు జాబ్‌మేళా

తాండూరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2019–23 మధ్య డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఉదయం 10 గంటలకు కళాశాలకు చేరుకోవాలని తెలిపారు. జాబ్‌మేళాలో టెక్ మహీంద్రా, సైక్స్, ఎగ్జిట్ సొల్యూషన్స్, జెన్‌పాక్ట్ వంటి పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

మర్రి రాజిరెడ్డికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న మర్రి రాజిరెడ్డి

బంట్వారం: రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ సోషల్ యాక్టివిస్టు మర్రి రాజిరెడ్డి డాక్టరేట్ దక్కించుకున్నారు. మర్పల్లి మండలం సిరిపురానికి చెందిన రాజిరెడ్డి చేసిన సేవలను గుర్తించిన రాజస్థాన్ సన్‌రైజ్ యూనివర్సిటీ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. ఇటీవల గోవా రాజధానిలో వీసీ డాక్టర్ మురళీధర్‌రావు చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా మర్రి రాజిరెడ్డి మాట్లాడుతూ.. రాజస్థాన్ సన్‌రైజ్ యూనివర్సిటీ తన సేవలను గుర్తించి డాక్టరేట్ అందజేయడం సంతోషంగా ఉందన్నారు. సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

'ఆసరా' కోసం ఆశగా..

- ఏడాదిన్నరగా పింఛన్ల కోసం వృద్ధుల ఎదురుచూపులు
- అర్హత ఉన్నా అందని సర్కారు సాయం



వయస్సు ధ్రువీకరణ పత్రాలు చూపుతున్న వృద్ధులు

బషీరాబాద్: ఏడాదిన్నర క్రితం దరఖాస్తు చేసినా ఆసరా పింఛన్లు మంజూరు కాలేదని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఆగస్టులో కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. అప్పట్లో మండలంలోని ఎక్మాయి పల్లికి చెందిన తాండ్ర బుగ్గయ్య(68), అద్దం ఆశన్న(68), పుప్పలి బుగ్గయ్య(78), తాండ్ర తిప్పయ్య(66), పులగరి చిన్న బిచ్చప్ప(68), ఎల్లప్ప(దివ్యాంగుడు) ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. కానీ వీరికి మంజూరు కాలేదు. తమకు పింఛన్లు మంజూరు చేయాలంటూ నిత్యం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున తమకు ఇప్పుడైనా న్యాయం జరుగుతుందేమోనని కనిపించిన ప్రతి అధికారి, ప్రతి నాయకుడిని వేడుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు ఆసరా కల్పించాలని వారు కోరుతున్నారు.

గీత కార్మికులకు అండగా కేసీఆర్ ప్రభుత్వం



చెక్కు అందజేస్తున్న పల్లె రవికుమార్‌గౌడ్

కడ్తాల్: గీత కార్మికులకు కేసీఆర్ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు. తాటి చెట్టు పైనుంచి పడి ప్రమాదాలకు గురవుతున్న వారికి బాసటగా నిలిచేందుకు గీతన్న బీమా పథకానికి రూపకల్పన చేస్తోందని తెలిపారు. చరికొండ గ్రామంలో ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి మృతిచెందిన అబ్బయ్యగౌడ్ కుటుంబాన్ని ఆదివారం ఆయన పరామర్శించారు.

ఖాళీలు 563.. భర్తీ 191



టీఆర్టీ శిక్షణ తీసుకుంటున్న నిరుద్యోగులు

టీచర్ పోస్టుల్లో మూడో వంతే నియామకాలు

- నిరాశలో టీఆర్టీ అభ్యర్థులు
- ప్రభుత్వ నిర్ణయంపై నిరుద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం
- ఖాళీలు మొత్తం భర్తీ చేయాలని డిమాండ్

వికారాబాద్ అర్బన్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ నిర్ణయంపై నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులో మూడో వంతు మాత్రమే భర్తీ చేస్తున్నారని మండి పడుతున్నారు. మూడు రోజుల క్రితం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి వెల్లడించిన ప్రకారం ఈ జిల్లాలో కేవలం 191 పోస్టులు మాత్రమే భర్తీ చేయనున్నట్లు తెలిసింది. ఈ నిర్ణయం నిరుద్యోగులను ఆందోళనకు గురిచేస్తోంది. వాస్తవానికి జిల్లాలో ఉపాధ్యాయల కొరత తీవ్రంగానే ఉంది. ఇటీవల టీచర్లను సర్దుబాటు చేసే సమయంలో విద్యాశాఖ జిల్లా అధికారులు ఖాళీలను తేల్చారు. జిల్లాలో ఏర్పడి ఖాళీల మొత్తాన్ని భర్తీ చేస్తారని నిరుద్యోగులు ఇన్నాళ్లు ఆశగా ఎదురు చూశారు. అయితే ప్రభుత్వ ప్రకటనతో ఒక్కసారిగా నిరుద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

2017 తరువాత ఇప్పుడే..

2017లో టీఆర్టీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం తిరిగి ఇప్పుడు ప్రకటన విడుదల చేసింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చాక పెద్ద ఎత్తున ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తుందనే ఆశతో నిరుద్యోగులు ఇన్నాళ్లు ఎదురు చూశారు. అయితే ప్రస్తుత ప్రకటనతో ఒక్కసారిగా వారిలో నిరుత్సాహాన్ని నింపింది.

తెలుగు మీడియంలో ఖాళీలు

లాంగ్వేజ్ పండిత్ (తెలుగు)	-	09
లాంగ్వేజ్ పండిత్ (హిందీ)	-	10
ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం	-	64
పీఈటీ	-	05
ఎస్‌ఏ బయో సైన్స్	-	61
ఎస్‌ఏ ఇంగ్లిష్	-	56
ఎస్‌ఏ హిందీ	-	07
ఎస్‌ఏ మ్యాథ్స్	-	20
ఎస్‌ఏ పీడీ	-	07
ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్	-	10
ఎస్‌ఏ సోషల్	-	70
ఎస్‌ఏ తెలుగు	-	17
ఎస్జీటీ	-	170

ఈ ఆరేళ్ల కాలంలో జిల్లాలో వేల మంది విద్యార్థులు డైట్, బీఎడ్ పూర్తి చేసి టెట్ క్వాలిఫై అయి డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో ఖాళీలు 563

317 జీవో అమలు సమయంలో జిల్లా ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల వివరాలను సేకరించారు. జీవో అమలు పూర్తయ్యాక ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం మరోమారు విద్యాశాఖ అధికారులు ఖాళీల లెక్కలు తీశారు. దీంతో అన్ని సబ్జెక్టులు కలిపి 563 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. ఇదే విషయాన్ని జిల్లా అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. అయితే జిల్లాలో 563 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉండగా కేవలం 191 పోస్టులు భర్తీ చేయడం ఏమిటని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఉర్దూ మీడియంలో ఖాళీలు

లాంగ్వేజ్ ఉర్దూ	-	03
బయో సైన్స్	-	01
ఎస్‌ఏ మ్యాథ్స్	-	06
ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్	-	04
ఎస్‌ఏ సోషల్	-	05
ఎస్‌ఏ ఉర్దూ	-	04
ఎస్జీటీ	-	34

ప్రస్తుతం జిల్లాలో భర్తీ చేసే పోస్టుల సంఖ్య ఇలా..

స్కూల్ అసిస్టెంట్	-	102
ఎస్జీటీ	-	77
లాంగ్వేజ్ పండిత్	-	12
మొత్తం	=	191

బోధనకు ఇబ్బందిగా..

జిల్లాలో జెడ్పీహెచ్‌ఎస్, యూపీఎస్, పీఎస్ కలిపి 1,054 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 91,898 మంది విద్యార్థులు చదువుతున్నారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, పీఈటీలు కలిపి 3,618 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహించాల్సి ఉండగా 3,055 మందే పని చేస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో 563మంది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చాలా కాలంగా నియామకాలు చేపట్టకపోవడంతో బోధనకు ఇబ్బందిగా మారింది. ఇంత పెద్ద మొత్తంలో ఖాళీలను పెట్టుకొని నామమాత్రంగా భర్తీ చేస్తే ఆందోళన తప్పదని టీఆర్టీ అభ్యర్థులు హెచ్చరిస్తున్నారు.

మొత్తం భర్తీ చేయాల్సిందే



జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు మొత్తం భర్తీ చేయాలి. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కంటి తుడుపు చర్యగా భర్తీ చేస్తే చాలా నష్టపోతాం. ఐదేళ్లుగా అన్నీ పనులు మానుకొని టీఆర్టీ కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం మా జీవితాలతో ఆడుకోవద్దు.

– నిరూప, ఎస్జీటీ అభ్యర్థి

మభ్యపెట్టడానికేనా?



ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించడం వెనుక కుట్ర ఉంది. కేవలం నిరుద్యోగులను మభ్య పెట్టడానికే ప్రకటన చేసారనే అనుమానం కలుగుతోంది. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఖాళీ పోస్టులు మొత్తం భర్తీ చేయాలి. లేదంటే నిరుద్యోగుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది.

– ప్రశాంత్ కుమార్, టీఆర్టీ అభ్యర్థి

మనం కోరుకున్నది ఇదేనా?



ప్రత్యేక రాష్ట్రంలో మనం కోరుకున్నది ఇదేనా?.. మన ఉద్యోగాలు ఆంధ్రవాళ్లు సుకపోతున్నారని పోరాటం చేశాం. ఇప్పుడు జరుగుతున్నది ఏంది. ఖాళీలు భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారు. కేవలం 5,800 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించడం దారుణం.

– మోహన్, టీఆర్టీ అభ్యర్థి



వికారాబాద్ పోలింగ్ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ఓటరు జాబితా రూపకల్పన పక్కాగా ఉండాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఆదివారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వికారాబాద్ మున్సిపల్ కార్యాలయం, శివరాం నగర్‌లోని బాల్ భవన్, వెంకటాపూర్ తండాలోని ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. బీఎల్‌ఓలు తమ పరిధిలో ఓటరు జాబితా రూపకల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలన్నారు. ఇప్పుడు తయారయ్యే ఓటరు జాబితా రాబోయే ఎన్నికలకు ఉపయోగపడుతుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు, అలాగే ఓటరుగా నమోదు కాని వారిని గుర్తించి ఓటు హక్కు పొందేలా చొరవ తీసుకోవాలని సూచించారు. రెండు చోట్ల ఓట్లు ఉన్న వారిని, చనిపోయిన వారిని గుర్తించి ఓటరు జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. పట్టణంలోని 2వ వార్డులో ఆదివారం ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెప్పేది ఒకటి చేసేది మరొకటని అన్నారు. పట్టణంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. తాగునీటి సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారని అన్నారు. సీసీ రోడ్లు లేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. పట్టణాలను నగరాలుగా తీర్చిదిద్దుతామని చెప్పిన ప్రభుత్వం గ్రామాలకన్న హీనంగా చేసిందన్నారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, నాయకులు రామకృష్ణారెడ్డి, మైపాల్, నర్సింహులు, జగన్, యాదయ్య, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న టీఆర్‌ఆర్

క్రీడలతో మానసికోల్లాసం

క్రీడలతో మానసిక ఉల్లాసం పొందవచ్చని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎర్రగడ్డపల్లిలో జరుగుతున్న క్రికెట్ పోటీలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలు ఆడటం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని ఆయన క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, మల్లేష్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో వరి సాగు



పరిగి మండలంలో వరి నాట్లు వేస్తున్న రైతులు

- చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉండడమే కారణం
- ఇంకా కొనసాగుతున్న నాట్లు
- జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 77,554 ఎకరాలు
- ఈ ఏడాది సాగు చేసింది 89వేల ఎకరాలు
- మరింత పెరిగే అవకాశం
- శాస్త్రీయ పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాఖ సూచన

వికారాబాద్: ఈ ఏడాది వరి సాగు గణనీయంగా పెరిగింది. అంచనాలకు మించి రికార్డు స్థాయిలో వరి సాగవుతోంది. ఇప్పటికే సాధారణ సాగు విస్తీర్ణం దాటి 89 వేల ఎకరాలకు చేరుకుంది. నెల రోజులుగా వరి నాట్లు వేయడంపై రైతన్న బీజీగా ఉన్నాడు. సెప్టెంబరు మొదటి వారం వరకు నాట్లు కొనసాగే అవకాశం కనిపిస్తోంది. జిల్లాలో అత్యధికంగా పరిగి, కొడంగల్, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల్లో వరి సాగు చేస్తున్నారు.

సాధారణ సాగు విస్తీర్ణాన్ని మించి..

జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 77,554 ఎకరాలు కాగా ఈ ఏడాది 93 వేలు దాటింది. ఇందులో 89వేల ఎకరాలు వరి సాగే. అత్యధికంగా పరిగి వ్యవసాయ డివిజన్‌లో 35,139 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఆ తరువాత కొడంగల్ డివిజన్‌లో 25,664 ఎకరాలు, తాండూరు డివిజన్‌లో 22,322 ఎకరాలు, వికారాబాద్ డివిజన్‌లో 2,582 ఎకరాల్లో వరి సాగు చేశారు. జిల్లాలో 20 మండలాలు ఉండగా 13 మండలాల్లో వెయ్యికి పైగా ఎకరాల్లో వరి సాగు చేసినట్లు తెలిసింది.

విత్తనాల ఎంపిక ఇలా..

ప్రస్తుతం జిల్లా రైతులు బీపీటీ 5204, ఎంటీయూ 1010, ఎంటీయూ 1001, చిట్టిముత్యాలు, సాంబా మసూరి, భరణి, కాటన్‌దొర సన్నాలు, సోమశిల, సింహపురి, తెలంగాణ సోనా, కేఎన్‌ఎం సన్నాలు సాగు చేశారు. ఎకరాకు 40 బస్తాల వరకు వస్తుందని రైతులు అంటున్నారు. సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు.

మోతాదుకు మించి ఎరువులు

ఈ ప్రాంత రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడుతున్నారు. దీంతో లాభాల కంటే అనర్థాలే ఎక్కువ. యూరియా ఎక్కువగా వాడడం వల్ల పైరు ఎక్కువగా పెరిగి పచ్చగా మారుతుంది. దీంతో చీడ పీడలు పెరిగి పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. జిల్లా రైతుల అవసరం మేరకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాం.

– గోపాల్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

టీటీడీ బోర్డు సభ్యురాలికి సన్మానం

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా ఎన్నికైన చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి సతీమణి గడ్డం సీతను ఆదివారం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ దంపతులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొకే అందజేసి సన్మానించారు.

– అనంతగిరి



సీతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్ దంపతులు

లీడర్ల దయ.. అర్హుల ప్రాప్తి



దౌల్తాబాద్‌లో గృహలక్ష్మి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

- ప్రభుత్వ పథకాల అమలులో నేతలదే తుది నిర్ణయం
- ఎన్నికల వేళ పథకాల ప్రకటనలతో ప్రజల్లో ఆశలు
- తుది జాబితా రూపకల్పనలో రాజకీయ జోక్యం
- అధికార పార్టీ నాయకుల తీరుపై ప్రతిపక్షాల మండిపాటు

పరిగి: ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రకటిస్తోంది. దీంతో పేదలు, అర్హుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అయితే దశల వారీగా పథకాలు అమలు చేసే అవకాశం కనిపిస్తుండడంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. మొదటి దశలోనే పథకాలు దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అంతేకాకుండా అర్హుల ఎంపికలో రాజకీయ జోక్యం కూడా పెరగడంతో లబ్ధిదారులు ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అర్హుల జాబితాలో తమ పేర్లు ఉండేలా చూడాలని కోరుతున్నారు. దీంతో వారు అధికార పార్టీకి మద్దతు తెలపాలని, పార్టీలో చేరాలని ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ పథకాల ఎంపికకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తుది జాబితా సిద్ధం చేస్తున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యేలదే తుది నిర్ణయం అవుతోంది. బీసీలకు లక్ష రూపాయల ఆర్థిక సాయంలో పలు చోట్ల జాబితా మారిందని ఆందోళన చెందుతున్నారు. తొలి జాబితాలో ఉన్న తమ పేర్లు మార్చారని పలువురు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతోనే అనర్హులకు పథకాలు అందుతున్నాయని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు.

బీసీ సాయం కోసం ఆరాటం

బీసీ బంధు పథకానికి జిల్లా వ్యాప్తంగా 14వేల దరఖాస్తులు వచ్చాయి. అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. మొదటి విడతలో జిల్లా వ్యాప్తంగా 3వేల మందికి.. నియోజకవర్గానికి వంద మందికి చొప్పున ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించారు. దరఖాస్తు చేసుకుని వారు తమకే ముందు రావాలని రాజకీయ నాయకుల చుట్టూ తిరిగారు. బీఆర్‌ఎస్ నాయకులు, అధికార పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు అర్హుల జాబితాను తయారు ఎమ్మెల్యేలకు ఇస్తున్నారు. వారు ఆ జాబితాను అధికారులకు అందజేస్తుండడంతో అదే తుది జాబితా అవుతోంది.

గృహలక్ష్మి పథకం ఎంపిక లోనూ..

జిల్లా వ్యాప్తంగా 57,571 మంది గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. నియోజకవర్గానికి మూడు వేల చొప్పుల ఇళ్లను మంజూరు చేయడంతో అర్హుల ఎంపిక క్లిష్టంగా మారింది. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను మండల అధికారులు ఈ నెల 25వ తేదీ నాటికి పూర్తి చేసి ఉన్నతాధికారులకు అందజేశారు. అయితే అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామాల్లో తిరుగుతూ తమ పార్టీలో చేరితే ఇల్లు ఇప్పిస్తామని చెబుతున్నట్లు తెలిసింది. దళిత బంధు, మైనార్టీల లక్ష సాయంలో కూడా ఇదే తరహా పద్ధతి అమలతున్నట్లు సమాచారం.

ఔను వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు..!

- ఒక్కతాటిపైకి మంత్రి పట్నం, ఎమ్మెల్యే పైలెట్ వర్గీయులు
- ఫలించిన ఎంపీ రంజిత్‌రెడ్డి రాజీ మంత్రం
- సమష్టి కృషితో రోహిత్‌రెడ్డిని గెలిపించాలని తీర్మానం

తాండూరు: ఔను.. వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు.. నిన్నటి వరకు పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి వర్గీయులు ఉప్పు నిప్పులా చిటపటలాడేవారు. అధిష్టానం చొరవతో వీరి మధ్య సఖ్యత కుదిరింది. దీంతో పట్నం.. పైలెట్ వర్గీయులు చేతులు కలపడమే మిగిలింది. రెండు రోజుల క్రితం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి.. మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి వర్గీయులను హైదరాబాద్‌కు పిలిపించి మాట్లాడారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు. అయితే కొందరు నాయకులు గతంలో తమపై అక్రమ కేసులు పెట్టారని ఎంపీ ఎదుటే చెప్పినట్లు తెలిసింది. స్పందించిన రోహిత్‌రెడ్డి తన వల్ల వచ్చిన సమస్యను తానే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి విషయంలో జోక్యం చేసుకోనని చెప్పినట్లు తెలిసింది. తాండూరు అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ఇందుకు వారు అంగీకరించినట్లు సమాచారం. ఆదివారం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వర్గీయులను కూడా ఎంపీ రంజిత్‌రెడ్డి తన నివాసానికి పిలిపించారు. గ్రూపు రాజకీయాలు పక్కన బెట్టి రోహిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అయితే ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని పట్నం వర్గీయులు తమకు ఇవ్వలేదని వైస్ చైర్‌పర్సన్ భర్త పట్లోళ్ల నర్సింహులు ఎంపీ ఎదుట అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఫిఫ్టీ ఫిఫ్టీ ఒప్పందం చేసిన మీరే తరువాత పట్టించుకోలేదని ఎంపీ ఎదుటే వాపోయినట్లు తెలిసింది. స్పందించిన ఆయన కొన్ని అనివార్య కారణాల వల్ల చైర్‌పర్సన్లను కదిలించడం కుదరలేదన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామని ఎంపీ హామీ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వర్గీయులు శాంతించినట్లు సమాచారం.

క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మినీ అంగన్వాడీ టీచర్స్ యూనియన్ సభ్యులు

అనంతగిరి: మినీ అంగన్వాడీ టీచర్లుగా పనిచేస్తున్న వారిని మెయిన్ టీచర్లుగా అప్ గ్రేడ్ చేసినందుకుగాను మినీ అంగన్వాడీ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వికారాబాద్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మినీ అంగన్వాడీ యూనియన్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు భారతి మాట్లాడుతూ.. సీఎం నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 3,989 మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. సానుకూల నిర్ణయం తీసుకున్న సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవితకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు నాగరాణి,, సునీత యాదమ్మ, సోనీ, ప్రమీల, భవాని, స్వరూప, శ్రీలత, తారాబాయి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్‌గౌడ్



అనంతపద్మనాభ స్వామి ఆలయంలో నాయకులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణ సమీపంలోని అనంత పద్మనాభస్వామిని ఆదివారం మహాజన సోషలిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. ఆయన వెంట పార్టీ జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ తదితరులున్నారు.

ఎరుకల కులస్తులు ఏకమవ్వాలి

సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింలు



మాట్లాడుతున్న నర్సింలు

దౌల్తాబాద్: ఎరుకల సంఘం సమస్యల పరిష్కారానికి కులస్తులంతా ఏకమై పోరాటం చేయాలని అప్పుడే తమను ప్రభుత్వం గుర్తిస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాగారి నర్సింలు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. 2003లో ఐకమత్యంతో పోరాటం చేస్తే అప్పటి ఎంపీ విఠల్‌రావు మహబూబ్‌నగర్‌లో ఏకలవ్య కాలనీ ఏర్పాటు చేశారన్నారు. పదేళ్ళుగా ప్రభుత్వం ఎరుకలకు ఏ పథకాలు అందించడం లేదన్నారు. త్వరలో అన్ని మండల కమిటీలను ఏర్పాటు చేసి సంఘం బలోపేతం చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మద్దూరు, దౌల్తాబాద్ మండలాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కిష్టప్ప, బాల్‌రాజు, వెంకటయ్య, బాలయ్య, దేవప్ప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ సాగు కనుమరుగు

కాలంతో పాటు పోటీతత్వం, సాంకేతికతతో పురాతన వ్యవసాయం కనుమరుగవుతోంది. వాణిజ్య పంటల సాగుతో ఆహార ధాన్యాల సాగు తగ్గుతోంది. దీంతో నిత్యావసర ధరలు చుక్కలనంటుతున్నాయి.

- వాణిజ్య పంటల వైపే రైతుల మొగ్గు
- తగ్గుతున్న ఆహార ధాన్యాల సాగు
- పెరుగుతున్న ధరలు



మోమిన్‌పేట: విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు పెరుగుతుండగా.. మరో వైపు గిట్టుబాటు ధరలు రాక సంప్రాదాయ పంటల సాగు కనుమరుగవుతోంది. పంట సాగులో వైవిద్యం లోపిస్తోంది. వాణిజ్య పంటలైన పత్తి, మొక్కజొన్న పైనే రైతులు ఆసక్తి చూపడంతో ఆహార ధాన్యాల సాగు క్రమంగా తగ్గుతోంది. మండల వ్యాప్తంగా 22,560 ఎకరాల సాగు భూమి ఉంది. అందులో 25శాతం భూమి రియల్ వ్యాపారం వలన బీడుగానే ఉంది. 60శాతం కేవలం వాణిజ్య పంటలైన పత్తిని సాగు చేస్తున్నారు. ఒకప్పుడు ఆహార ధాన్యాలకు పెద్దపీట వేస్తూ పచ్చజొన్న, తెల్ల జొన్న, కొర్రలు, వరి, వేరుశనగ, కుసుమ, కంది, పెసర, మినుము, శనగ, అనుము, యవ్వలు, కూరగాయలు, వాణిజ్య పంట చెరుకు సాగు చేసేవారు. ఇందుకు భిన్నంగా పత్తి సాగు ఏటేటా పెరుగుతోంది. ఆహర ధాన్యాల పంటలు క్రమంగా తగ్గుతుండగా జొన్న సాగు మండలంలో పూర్తిగా తగ్గింది. ఇలా ప్రతి గ్రామంలో ఆహార ధాన్యాల పంటల సాగు తగ్గడంతో కొరత ఏర్పడి ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. అప్పట్లో రైతులు కేవలం ఉప్పు మాత్రమే కొనుగోలు చేసేవారు. గతంలో జొన్నలు, కొర్రలు ప్రతీ ఇంట్లో బస్తాల కొద్ది నిలువ ఉండేవి. ఇప్పుడు ప్రతీ ఒక్కరు కొనుగోలుకే మొగ్గు చూపుతున్నారు.

చెరుకు కనుమరుగు

ప్రతీ సంవత్సరం పత్తి సాగు పెరుగుతూనే ఉంది. నాలుగేళ్లుగా రెట్టింపు విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. అదే స్థాయిలో ఆహార ధాన్యాల సాగు తగ్గుతోంది. బీటీ వచ్చిన తర్వాత పత్తి సాగు గణనీయంగా పెరిగింది. పప్పు ధాన్యాల సాగు వందల ఎకరాలకు పడిపోయింది. మొక్కజొన్నలో అంతర పంటగా మాత్రమే కంది సాగు చేస్తున్నారు. కూరగాయల సాగు కొంత పెరిగినా, చెరుకు సాగు కన్పించడం లేదు.

ఆకాశాన్నంటుతున్న ధరలు

ఏటేటా ఆహార ధాన్యాల ధరలు ఎగబాకుతున్నాయి. జొన్నలు, బియ్యం ధరలు ఆకాశన్నంటుతున్నాయి. మూడేళ్ల క్రితం బియ్యం క్వింటాలుకు రూ.3,500లు ఉండగా ప్రస్తుతం రూ.5వేల పైనే, పచ్చ, తెల్ల జొన్నలు రూ.6వేల పైమాటే. కంది, పెసర, మినప, శనగ పప్పు కిలోకు రూ.50లోపు ఉండేది. ప్రస్తుతం రూ.140లకు తగ్గడం లేదు. నూనె ధరలు అంతే వేగంగా పెరుగుతున్నాయి.

పెరిగిన రసాయనిక ఎరువుల వినియోగం

సేంద్రియ ఎరువుల వాడకం తగ్గి రసాయనిక ఎరువుల వినియోగం పెరిగింది. ఫలితంగా భూసారం తగ్గి వాతావరణ కాలుష్యం ఏర్పడుతోంది. విచ్చలవిడిగా క్రిమిసంహార మందులు, రసాయనిక ఎరువులను వాడడంతో రైతులకు పెట్టుబడి ఖర్చు విపరీతంగా పెరుగుతోంది. పంటలకు మేలు చేసే పక్షులు, కీటకాల సంతతి తగ్గుతుంది. పంట మార్పిడి చేస్తే దిగుబడులు అధికమవుతాయి. ఆహార ధాన్యాల కొరత తీరుతుంది. రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులను వాడితే భూసారం పెరిగి పెట్టుబడులు తగ్గుతాయి.

ప్రస్తుతం పత్తి సాగు



ఒకప్పుడు బస్తాల కొద్ది పచ్చ, తెల్ల జొన్నలు, కొర్రలు, కుసుమలు పండించేది. ప్రస్తుతం పత్తి, కూరగాయల సాగు చేస్తున్నా. కుటుంబానికి సరిపడ తెల్లజొన్నలు కొనుగోలు చేస్తున్నా.

– రంగారెడ్డి, రైతు, సయ్యద్ అల్లిపూర్

కూలీల కొరత



అప్పట్లో పెసర, మినుము పంటను ఎక్కువ విస్తీర్ణంలో పండించే వాన్ని. రబీలో కుసుమ పంటను పండించే వారం. కూలీల కొరత వాతావరణం అనుకూలించక పత్తి పంటను సాగు చేస్తున్నా. పప్పులను కొనుగోలు చేస్తున్నా.

– నాగయ్య, రైతు, ఎన్కేపల్లి

అవగాహన కల్పిస్తున్నాం



రసాయనిక ఎరువులను విరివిగా వాడొద్దని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సేంద్రియ ఎరువులు వాడకంతో భూసారం పెరుగుతుందని వివరిస్తున్నాం. పప్పు ధాన్యాలను ఉత్పత్తి పెంచేందుకు కంది, మినుము పండించే రైతులకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులను అందిస్తున్నాం.

– జయశంకర్, ఏఓ, మోమిన్‌పేట

ఆరోగ్యమే మహాభాగ్యం

- తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్
- మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో 'సైక్లోథాన్'



ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఎస్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్

తాండూరు టౌన్: ఆరోగ్యాన్ని మించిన సంపద ఏదీ లేదని తాండూరు డీఎస్పీ శేఖర్‌గౌడ్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం(ఆగస్టు 29) సందర్భంగా మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో ఆదివారం సైక్లోథాన్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక గంగోత్రి విద్యాలయం నుంచి సుమారు 200 మంది విద్యార్థులు, మంచ్ సభ్యులు, తదితరులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ.. ఆరోగ్య పరిరక్షణకు ప్రతీ ఒక్కరు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. సైక్లింగ్ వల్ల శరీరంలోని అవయవాలన్నింటిలో కదలికలు ఉంటాయన్నారు. పిల్లలను ఆన్లైన్ గేమ్స్‌కు అలవాటు పడకుండా మైదానాలకు అలవాటు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న మాట్లాడుతూ.. ఆరోగ్య పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు మార్వాడీ యువ మంచ్ సైక్లోథాన్ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మంచ్ సభ్యులు బ్రిజ్‌మోహన్ బూబ్, కిషన్ రాఠి, అరుణ సార్డా, భారత్ దేవడా, రమేష్‌చంద్ర బూబ్, మన్మోహన్ సార్డా, సూర్యప్రకాశ్ సోమాని, గంగోత్రి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సైక్లోథాన్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

స్కూటీని ఢీకొట్టిన బైక్..

పాల వ్యాపారి మృతి

మొయినాబాద్: స్కూటీపై బంధువుల ఇంటికి వెళ్తుండగా ఎదురుగా అతివేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో ఓ పాల వ్యాపారి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి మండలంలోని ముర్తూజగూడ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండలంలోని బాకారం గ్రామానికి చెందిన బద్దుల రాములు(45) పాల వ్యాపారి. శనివారం సాయంత్రం ముర్తూజగూడలో ఉన్న బంధువుల ఇంటికి స్కూటీపై బయలుదేరాడు. మొయినాబాద్ నుంచి ముర్తూజగూడకు మట్టి రోడ్డులో వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన మహిపాల్ బైక్‌పై అతివేగంగా వచ్చి స్కూటీని ఢీకొట్టాడు. దీంతో రాములకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి రెఫర్ చేశారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు.

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి



కొడంగల్ రూరల్: కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్

కొడంగల్ రూరల్: సెకండ్ ఏఎన్ఎంల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ , సీఐటీయూ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆదివారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఎదుట దీక్షా శిబిరంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఏఎన్ఎంలను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన ఎంపీహెచ్ఏ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తూ కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, సెకండ్ ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ముట్టడి

అనంతగిరి: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సెకండ్ ఏఎన్ఎంలు చేపట్టిన సమ్మె ఆదివారంతో 13వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా ఆదివారం సెకండ్ ఏఎన్ఎంలు మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం సెకండ్ ఏఎన్ఎంల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. 20 ఏళ్లుగా ఎన్నో వ్యయప్రయాలకోర్చి పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలపై కక్షసాధింపు చర్యలు విరమించుకోవాలన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం కలెక్టరేట్ ముట్టడి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, సెకండ్ ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

తుది ఓటరు జాబితా సిద్ధం చేయండి

అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ



ధారూరు: బీఎల్ఓలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

ధారూరు: రానున్న సాధారణ ఎన్నికలకు తుది ఓటరు జాబితా సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులకు సూచించారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని కేరెళ్లి, హరిదాస్‌పల్లి, చింతకుంట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు ప్రత్యేక శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ఇంటింటికీ తిరిగి వివరాలు తీసుకుని అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు నమోదు చేయించాలన్నారు. వచ్చే నెల 2, 3న పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆయన అకారానేలపే ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ భువనేశ్వర్, డిప్యూటీ తహసీల్దార్ విజయ్, బీఎల్ఓలున్నారు.

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు

పెద్దేముల్: ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు, ప్రతీ పౌరుడు దానిని వినియోగించాలని తహసీల్దార్ కిషన్ అన్నారు. శనివారం, ఆదివారం మండల వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో గోట్లపల్లి, ఇందూరు, గాజీపూర్, హన్మాపూర్, గిర్మాపూర్, జైరాంతండా (ఇందూరు)తో పాటు పలు గ్రామాలల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అసెంబ్లీ ఎన్నికల నాటికి పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చుడాలని ఆర్ఐ రాజిరెడ్డికి సూచించారు.

ఎన్నికలనాటికి సౌకర్యాలు కల్పించాలి

కుల్కచర్ల: మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల నాటికి సిద్ధంగా ఉంచాలని తహసీల్దార్ మురళీధర్ అన్నారు. ఆదివారం ఆయన బొంరెడ్డిపల్లి, ఘణాపూర్, సాల్వీడు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అనుకూలంగా వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట ఆయా గ్రామాల బీఎల్ఓలున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కొడంగల్: మండల పరిధిలోని చిట్లపల్లి, అంగడిరాయిచూర్, టేకుల్‌కోడ్, అన్నారం, రుద్రారం గ్రామాల్లో తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్ ఆదివారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల నాటికి అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఇబ్బందులు తెలుసుకుని స్థానిక నాయకులతో మాట్లాడారు. మండల పరిధిలో 41 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ విజయకుమార్ చెప్పారు.

ఓటర్లుగా నమోదు చేసుకోండి.

అనంతగిరి: అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ సూచించారు. ఆదివారం కొనసాగిన ఓటర్ నమోదు స్పెషల్ క్యాంపెయిన్‌ను ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్‌బూత్‌లలో సిబ్బంది తీసుకుంటున్న దరఖాస్తులపై ఆరా తీశారు. సెప్టెంబర్ 2, 3 తేదీల్లో మరోమారు స్పెషల్ క్యాంపెయిన్ ఉంటుందని చెప్పారు.



కొడంగల్: రుద్రారంలో తహసీల్దార్ విజయ్‌కుమార్



పెద్దేముల్: గొట్లపల్లిలోలో కొత్త ఓటరు నమోదు కార్యక్రమం



కుల్కచర్ల: బొంరెడ్డిపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళీధర్

ప్రాణం తీసిన అతివేగం

లారీ ఢీకొని వ్యక్తి మృతి



సాదిక్ హుస్సేన్ మృతదేహం

తాండూరు రూరల్: ఓ లారీ డ్రైవర్ అజాగ్రత్త, అతివేగంతో ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఈ సంఘటన మండల పరిధిలోని కరన్‌కోట్‌లో ఆదివారం చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి ప్రకారం.. గ్రామానికి చెందిన సాదిక్ హుస్సేన్(34) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఉదయం ఆయన అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిలబడి ఉండగా అతి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. తీవ్రగాయాలవ్వడంతో జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. భార్య సలీమాబేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గొంతు కోసి బాలుడి దారుణ హత్య



రాజాపాశ్వాన్(ఫైల్)

రాజేంద్రనగర్: ఓ బాలుడిని గొంతు కోసి అతి కిరాతకంగా హత్య చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. బండరాయి పై గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని పరిశీలించగా గొంతు కోసి హత్య చేసి ఉన్నట్లు గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సంఘటనా స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, ఏసీపీ గంగాధర్, క్లూస్, డాగ్ స్క్వాడ్ బృందం ఆధారాలు సేకరించారు. ఇన్‌స్పెక్టర్ మధు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన సంజయ్ పాశ్వాన్ భార్య, కుమారుడు రాజా పాశ్వన్(17)తో కలిసి బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చాడు. కాటేదాన్ లక్ష్మిగూడ హౌసింగ్ బోర్డు కాలనీలో ఉంటూ స్థానిక పరిశ్రమలో పని చేస్తున్నాడు. అతడి కుమారుడు రాజాపాశ్వన్ ఇదే ప్రాంతంలోని స్క్రాబ్ దుకాణంలో పని చేసేవాడు. శనివారం ఉదయం పనికి వెళ్లిన రాజా పాశ్వాన్ సాయంత్రం ఇంటికి వచ్చాడు. శనివారం కావడంతో షాప్‌కు వెళ్లి బత్తా తెచ్చుకుంటానని చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో అతడి కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. దుకాణ యజమాని వద్దకు వెళ్లి ఆరా తీయగా డబ్బులు తీసుకుని వెళ్లిపోయినట్లు చెప్పాడు. ఆ దివారం ఉదయం హౌసింగ్ బోర్డు కాలనీలోని నిర్మాణుష్య ప్రాంతంలో బండరాయిపై యువకుడు పడి ఉన్నట్లు గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించా రు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సంజయ్‌పాశ్వాన్ మృతుడు తన కుమారుడిగా గుర్తించాడు. పంచనామా నిర్వహించిన పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. డాగ్ స్క్వాడ్‌తోపాటు క్లూస్ టీమ్ సంఘటనా స్థలం వద్ద ఆధారాలుసేకరించాయి. రాజా పాశ్వాన్ రెండు రోజుల క్రితం స్థానిక యువకులతో గొడవ పడినట్లు తెలిసింది. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ మధు తెలిపారు. సీసీ పుటేజీలను సేకరించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అధిక వడ్డీకి ఆశపడి..

యాచారం: అధిక వడ్డీకి ఆశపడి ఓ మహిళ ఓ వ్యక్తికి రూ.లక్ష అప్పు ఇచ్చి మోసపోయింది. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని పలుమార్లు అడిగిన సమాధానం లేకపోవడంతో ఆదివారం యాచారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల ప్రకారం మండలంలోని కొత్తపల్లికి చెందిన తండ్రి కొడుకులైన చందు, సంతోషలు అధిక వడ్డీ ఆశ చూపి మాల్ గ్రామానికి చెందిన భాగ్యమ్మ వద్ద కొద్ది నెలల కింద రూ.లక్ష అప్పుగా తీసుకున్నారు. నెలలు గడిచినా వడ్డీ, అసలు ఇవ్వడం లేదు.. దీంతో పలుమార్లు భాగ్యమ్మ తన డబ్బులు ఇవ్వాలని చందు, సంతోషలను అడిగింది. వారి నుంచి స్పందన లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో స్పందించిన ఎస్ఐ గోపాల్ వెంటనే చందు, సంతోషలను పీఎస్‌కు పిలిపించి భాగ్యమ్మ వద్ద తీసుకున్న రూ. లక్ష నగదును ఇచ్చేయాలని హెచ్చరించాడు. లేని పక్షంలో కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. దీంతో త్వరలో రూ.లక్ష నగదు ఇస్తామని పోలీసులకు చెప్పారు.



ఎస్ఐ గోపాల్‌కు ఫిర్యాదు చేస్తున్న భాగ్యమ్మ

వాలీబాల్ పోటీల్లో అంగడిచిట్టంపల్లి సత్తా



బహుమతిని అందుకుంటున్న అంగడిచిట్టంపల్లి టీం

పూడూరు: గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులను ప్రోత్సాహించేందుకే ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని పీడీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. గ్రామోత్సవం కార్యక్రమంలో భాగంగా వికారాబాద్‌లో నిర్వహించిన వాలీబాల్ జిల్లా స్థాయి పోటీల్లో తరిగోపుల, అంగడిచిట్టంపల్లి గ్రామాలు ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా అంగడిచిట్టంపల్లి జట్టుకు రూ.3వేల నగదుతో పాటు ట్రోఫీని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సతీశ్, ప్రవీణ్, నరేశ్ ,శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' దరఖాస్తులు జాగ్రత్తగా పరిశీలించాలి

డీఆర్డీఓ పీడీ కృష్ణన్

కొడంగల్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న వివరాలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాతే కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేయాలని డీఆర్డీఓ పీడీ కృష్ణన్ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు. ఆదివారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి అక్కడ ఆన్‌లైన్ చేసే విధానాన్ని తనిఖీ చేశారు. దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించారు. అర్హులా.. అనర్హులా అనే విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ పాండు, కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.



డేటా ఎంట్రీ పరిశీలిస్తున్న కృష్ణన్